క్లుప్తంగా

చెత్తసేకరణ కేంద్రాలను పూర్తి చేయండి



క్యాష్‌లెస్ పేమెంట్ మిషన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌతాళం: చెత్తసేకరణ కేంద్రాలను పూర్తి చేయాలని డీఎల్‌పీఓ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారాజు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బేస్ మట్టంలో ఉన్న, లింటల్ లెవెల్ ఉన్న వాటన్నింటిని పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతి పంచాయతీలో క్యాష్‌లెస్ పేమెంట్లు చేయాలని ఆదేశించారు. ఇందుకు ప్రభుత్వం క్యాష్‌లెస్ మిషన్ ఇస్తుందన్నారు. వీటి ద్వారా ఇంటి పన్నులు, కొళాయి డిపాజిట్లు వంటి వాటిని ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేపట్టాలన్నారు. ఈఓపీఆర్‌డీ జనార్దన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహమ్మద్‌రఫీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దుకాణాల్లో తనిఖీలు



సెల్‌ఫోన్ షాపును పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునీల్‌కుమార్

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని సెల్‌ఫోన్ దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, తూనికల కొలతల అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నాలుగు షాపుల్లో ఎమ్మార్పీ లేకుండా కవర్‌లు, మొబైల్ యాక్సెసరీస్ బ్లాక్‌లో అమ్ముతున్నారని గుర్తించారు. ఒక్కో దుకాణానికి రూ.20 వేల ప్రకారం జరిమానా విధించారు. మొత్తం నాలుగు షాపులపై రూ.75 వేలు జరిమానా విధించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.తూనికల కొలతల అధికారి శ్రీరామ్, విజిలెన్స్ ఏఈ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో మహబూబ్ సుభాని ఉరుసు



కౌతాళంలో దర్గాలో ఫాతెహాలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలో మహబూబ్ సుభాని ఉరుసు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలో మొక్కు చెల్లింపులో భాగంగా పలువురు భక్తులు జెండాలను ఇంటి నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గాలో ప్రత్యేక ఫాతెహాల అనంతరం ప్రతిష్ఠించారు. సాయంత్రం విద్యార్థులు, యువకులు ఆలపించిన సలాం పాటలు ఆకట్టుకున్నాయి.

ప్రాన్స్, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

ఆదోనిరూరల్: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, మత్స్యశాఖ జిల్లాధికారి సి.శ్యామలమ్మ శుక్రవారం ప్రాన్స్–ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. శ్యామలమ్మ మాట్లాడుతూ నవంబర్ 3, 4, 5వ తేదీల్లో కర్నూలులోని రావూరి గార్డెన్స్‌లో ప్రాన్స్–ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని, కార్యక్రమంలో చేపలు, రొయ్యల వినియోగం పెంచడం, వాటిని తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. సహాయ మత్స్య పర్యవేక్షకులు నాగరాజు, తహసీల్దార్ వెంకటలక్ష్మి, డీఎల్‌పీఓ కార్యాలయ ఏఓ వీరభద్రప్ప, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ విజయశేఖర్ పాల్గొన్నారు.

పొట్టేలుపై చిరుత దాడి

కోసిగి: మండల కేంద్రంలోని బసవన్న కొండ సమీపంలో నివాసం ఉంటున్న పీకలబెట్ట నరసప్పకు చెందిన పొట్టేలుపై చిరుత దాడి చేసింది. శుక్రవారం తెల్లవారుజామున గొర్రెల మందపై చిరుత దాడి చేసి అందులోని రూ.20 వేలు విలువ చేసే పొట్టేలును నోట కరచుకుని పొలాల్లోకి లాక్కెళ్లింది. పొట్టేలిని సగం మేర తిని కళేబరాన్ని అక్కడే వదిలేసి వెళ్లింది. ఉదయం పొలాల్లోకి వెళ్లి గాలించగా గొర్రె కళేబరం కనిపించింది. ఈ విషయంపై ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి గొర్రె కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. బాధితుడికి నష్ట పరిహారం వచ్చేలా చూస్తామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీ

కోసిగి: స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా నివాసం ఉంటున్న దళవాయి మల్లికార్జునకు చెందిన మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. రాత్రి ఇంటి కాంపౌండ్‌లో పార్కింగ్ చేసిన యమహా ఆర్‌ఎక్స్ 100 బైక్‌ను ఉదయం లేచి చూసే సరికి కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం







ఆయుష్మాన్ కార్డు పంపిణీ చేస్తున్న దృశ్యం, పెద్దహరివాణంలో మాట్లాడుతున్న అధికారులు, చిర్తనకల్లులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న దృశ్యం

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఎంపీడీఓ సుబ్బారాజు, గ్రామ నాయకులు అయ్యప్ప, భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఉరుకుంద గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, సుజాత, సరిత, నాయకులు వెంకటరామిరెడ్డి, చార్లెస్ పాల్గొన్నారు. మొత్తం 374 మందికి వైద్య సేవలందించగా ఇందులో ముగ్గురిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

ఆదోనిరూరల్ : ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుందని, సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ పుష్పలత, సర్పంచ్ రామన్న సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు నిసిగ్రేస్, వై.శేఖర్, మహేష్ పాల్గొని 754 మందికి వైద్యసేవలందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను అధికారులు పరిశీలించారు. అనంతరం కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజ్ పాల్గొన్నారు.

కోసిగి: మండలంలోని చిర్తనకల్లు గ్రామ సచివాలయం పరిధిలో మూగలదొడ్డి, చిర్తనకల్లు గ్రామ ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేశారు. శుక్రవారం చిర్తనకల్లు ప్రాథమిక పాఠశాల ఆవరణలో చిర్తనకల్లు సర్పంచ్ ఈరన్న, మూగలదొడ్డి సర్పంచ్ శివలింగమ్మ ఆధ్వర్యంలో డాక్టర్ మనోజ్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. మొత్తం 328 మందికి వైద్య సేవలందించారు. ఎంపీహెచ్‌ఈఓ ఎల్లప్ప, శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ కృపానందం, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయభాస్కర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పటిష్టమైన ఓటరు జాబితా తయారు చేస్తున్నాం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్ : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదోని నియోజకవర్గ పరిధిలో స్పెషల్ సమ్మరీ రివిజన్ – 2024కు సంబంధించి పటిష్టమైన ఓటరు జాబితాను తయారు చేస్తున్నామని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో సబ్ కలెక్టర్ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఆదోని నియోజకవర్గ ఓటరు జాబితాకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఎల్‌ఓలతో ఇంటింటికీ తిరిగి ఓటర్లను పరిశీలించామన్నారు. అప్పుడు గుర్తించిన మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన జాబితా తయారు చేసి త్వరలో సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించామన్నారు. ప్రచురించిన జాబితాకు సంబంధించిన దరఖాస్తులు, అభ్యంతరాలను 2023 డిసెంబర్ 1వ తేదీ వరకు స్వీకరిస్తామని, వాటిని పరిష్కరించి డిసెంబర్ 26 నాటికి పూర్తి చేస్తామన్నారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని సంబంధిత బీఎల్‌ఓ, ఏఈఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వచ్చే యేడాది జనవరి 1వ తేదీ నాటికి 18 యేళ్లు పూర్తి కానున్న యువతీ, యువకులు అర్హత కలిగి ఓటర్లుగా నమోదు కాకుంటే వారి నుంచి సంబంధిత పత్రాలు తీసుకొని జనవరి 5న ప్రచురించనున్న చివరి జాబితాలో వారిని పొందు పరుస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, డీఎల్‌పీఓ కార్యాలయ ఏఓ వీరభద్రప్ప, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ విజయశేఖర్, వైఎస్సార్‌సీపీ నుంచి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నుంచి దేవిశెట్టి ప్రకాష్, టీడీపీ నుంచి భూపాల్‌చౌదరి, బీజేపీ నుంచి నాగరాజుగౌడ్, సీపీఐ నుంచి సుదర్శన్, సీపీఎం నుంచి లక్ష్మణ్, జనసేన పార్టీ తరఫున తాయార్‌వలీ, టీఆర్‌ఎస్ నుంచి ఫయాజ్‌బాషా పాల్గొన్నారు.

ఘనంగా బాబా ఫకృద్దీన్ ఉరుసు

కౌతాళం: బాబా ఫకృద్దీన్ ఉరుసు ఉత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. మండలంలోని నదిచాగి గ్రామంలో వెలసిన బాబ ఫకృద్దీన్ దర్గాను నూతనంగా నిర్మించారు. గురువారం గంధం, శుక్రవారం ఉరుసు కావడంతో భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. మహబూబ్‌సుభాని ఉరుసుతో పాటు బాబా ఫకృద్దీన్ ఉరుసు కూడా కలిసి రావడంతో చుట్టూ పక్కల గ్రామాల ప్రజలే కాక కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. కాగా..గంధోత్సవంలో ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ పాల్గొని ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.

డిసెంబర్ వరకు సాగునీరివ్వాలి

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువకు డిసెంబర్ చివరి వరకు సాగునీరు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కోరారు. తుంగభద్ర నదిపై మేళిగనూరు వద్ద వరద కాలువ నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆటోజాతను శుక్రవారం కౌతాళంలో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండలంలో కరువు వాతావరణం ఉందని, ఎల్ఎల్‌సీకి డిసెంబర్ వరకు నీరిస్తేనే పంటలు పండుతాయని లేకపోతే రైతులు భారీగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. నవంబర్ 25వరకే సాగు నీరు అందిస్తామని అధికారులు చెబుతున్నారని, అలాగైతే కొన్ని పంటలు మాత్రమే చేతికందుతాయని చెప్పారు. తుంగభద్ర నదిపై వరద కాలువను నిర్మిస్తే ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందుతుందని, దీంతో వలసలను నివారించవచ్చన్నారు. పార్టీ మండల కన్వనర్ ఈరన్న, నాయకులు ఉలిగయ్య, వీరేష్, సత్యప్ప, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ ప్రవేశానికి నెలాఖరు వరకు గడువు

కౌతాళం: ఓపెన్ ఇంటర్‌లో చేరాలనుకునే వారికి ఈనెల చివరి వరకు అవకాశం ఉందని కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, అలాగే 15సంవత్సరాలు నిండిన వారై ఉండాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం, బైక్‌లతో పోలీసులు

మంత్రాలయం : మండలంలోని మాధవరం సర్కిల్‌లో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ.. ఆదోని పట్టణానికి చెందిన బోయ లక్ష్మి కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా, గిల్లేసూగురు క్యాంపు నుంచి కర్ణాటక మద్యం ఆదోనికి తరలిస్తుండగా మాధవరం సర్కిల్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఆమె నుంచి కర్ణాటక మద్యం 192 ఒరిజనల్ ఛాయస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్ల (90 ఎంఎల్)ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కోసిగి: మండలంలోని తుంబిగనూరు గ్రామ శివారులో పంప్ హౌస్ వద్ద నుంచి కోసిగికి చెందిన తమ్మనగేని సీతరాముడు అనే వ్యక్తితో పాటు మరొకరు బైక్‌లపై అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకొస్తుండగా దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కచ్చితమైన సమాచారం మేరకు..సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా పసిగట్టిన నిందితులు మద్యం, బైక్‌లను వదిలేసి పరారయ్యారు. రెండు బైక్‌లను సీజ్ చేసి 1152 టెట్రా ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దాడుల్లో ఏఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది మల్లికార్జున, తిప్పన్న ఉన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఆదోని సెంట్రల్: దీపావళి కానుకగా 50 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్‌టీయూ నాయకులు నాగరాజు, లోక్యనాయక్, వీరచంద్ర యదవ్, రమేష్ నాయుడు కోరారు. శుక్రవారం పట్టణంలోనిప్రభుత్వ పురపాలక పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిటీ వేసి దాదపు నాలుగు నెలలైనా ఇంత వరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. కమిటీ రిపోర్ట్ రావడానికి ఆలస్య కానున్న నేపథ్యంలో మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు ప్రసాద్, గురురాజా, వీరేష్, నాగేంద్రగౌడు, రాముడు పాల్గొన్నారు.

అరుణాచలంకు బస్సు సర్వీసు

ఎమ్మిగనూరుటౌన్: అరుణాచలం గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తుల కోసం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలంకు ప్రతి నెలా నడుపుతున్న బస్సు సర్వీసును శుక్రవారం రాత్రి 7 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ అమర్నాథ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు రాత్రి బయలుదేరి ఉదయం కాణిపాకం చేరుకుంటుందన్నారు. అక్కడ గణపతి దర్శనానంతరం శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని శనివారం పౌర్ణమి రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. అక్కడ గిరిప్రదర్శన అనంతరం తిరుగుప్రయాణమై 29వ తేదీన ఎమ్మిగనూరుకు చేరుకుంటుందని తెలిపారు. వచ్చే నెల 25వ తేదీన పౌర్ణమికి స్థానిక డిపో నుంచి రెండు బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు.

బాలికకు తీవ్ర గాయాలు

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని మాధవరం రోడ్డులో ఉన్న ఓ గుజిరిలో పనిచేస్తున్న బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక కాజీపుర వీధికి చెందిన మాబాషా కుమార్తె షామిన్ (14) అనే బాలిక గుజిరిలో ప్రెస్సింగ్ మిషన్ వద్ద పనిచేస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం ప్రమాదవశాత్తు బాలిక మిషన్‌లో చేయి పెట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గుజిరి యజమాని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడి వైద్యులు బాలికకు మూడు వేళ్లు పోయాయని, వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పారు. దీంతో మెరుగైన చికిత్స కోసం కర్ణాటక రాష్ట్రం బళ్లారికి తీసుకెళ్లినట్లు తెలిసింది. బాలికను పని పెట్టుకోవడం నేరమని తెలిసినా యజమాని నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకరమైన యంత్రాల వద్ద పని చేయించడం సరికాదని, బాలికను వారి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దాం

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- పోస్టర్లు విడుదల చేసిన మంత్రి, ఆదోని ఎమ్మెల్యే సాయి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

కర్నూలు(అగ్రికల్చర్): రాయలసీమ స్థాయిలో కర్నూలులో నవంబరు నెల 3,4,5 తేదీల్లో నిర్వహించే ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రత్యేక దృష్టి సారించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక పోషకాలకు నెలవైన చేపలు, రొయ్యల వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఫెస్టివల్‌ను రాయలసీమ స్థాయిలో పెద్ద ఎత్తున నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామల మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ప్రాన్స్, ఫిష్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగా ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి వేర్వేరుగా ఫిష్ ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

అయోడిన్ లోపిస్తే థైరాయిడ్

కర్నూలు (హాస్పిటల్) : వ్యాపారస్తులు తప్పనిసరిగా అయోడిన్ ఉన్న ఉప్పునే విక్రయించాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మా నాయకులు చెప్పారు. ప్రపంచ అయోడిన్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఓల్డ్‌టౌన్‌లో ఉప్పు విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూర్మా నాయకులు మాట్లాడుతూ శరీరంలో అయోడిన్ లోపిస్తే థైరాయిడ్ వ్యాధి వస్తుందన్నారు. కావున ప్రజలు అయోడిన్ ఉప్పుతో పాటు అయోడిన్ అధికంగా ఉండే దానిమ్మ, స్ట్రాబెర్రీ, పెరుగు, బంగాళాదుంప వంటి ఆహారాలను తీసుకోవాలన్నారు.

35 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వ



టీబీ డ్యాం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో శుక్రవారం 35.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో పూర్తి సామర్థ్యం మేరకు 105.788 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా డ్యాంకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. అలాగే కాలువలకు వదులుతున్న నీరు, ఆవిరి రూపంలో డ్యాంలో నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. శుక్రవారం డ్యాం 1609 అడుగులతో 35.4 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. డ్యాంలో నీటి చేరిక (ఇన్‌ఫ్లో) నిలిచిపోగా కాలువలకు (అవుట్‌ఫ్లో) వదిలే నీరు 9,066 క్యూసెక్కులుంది. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి సంబంధించి ఆంధ్రాలో కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 527 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

29 న ఉమ్మడి జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 29 వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎర్రగుంట్ల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 సంవత్సరాల నుంచి 95 సంవత్సరాల వయస్సు ఉన్న అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొన వచ్చని తెలిపారు. ఇందులో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్ ఉంటాయని తెలిపారు. పాల్గొనదలచిన వెంట ఆధార్ కార్డు, ఎంట్రీ ఫీజుతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారు డిసెంబర్ 8 నుంచి 10 వ తేదీ వరకు తిరుపతి పట్టణంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9985552896 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన



మరాఠీగేరిలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 31వ వార్డు మరాఠీగేరి, ఖాజీపుర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం చేపట్టిన వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మరాఠీ గేరిలో భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే ఆయా కాలనీల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించి బుక్‌లెట్‌లు అందజేశారు. పట్టణంలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాయంటే అతిశయోక్తి కాదని ఇదంతా జగనన్న కృషి అని కొనియాడారు. ఇచ్చిన హామీ మేరకు జనవరి నుంచి పింఛన్ సొమ్ము రూ.3వేలకు పెంచి అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని, తాగునీటి సరఫరా మెరుగుపరచాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.20 లక్షలు ప్రభుత్వం విడుదల చేస్తుందని, వాటితో వెంటనే పనులు చేపడతామని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు రేణుక, మంజుల, పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు రామలింగేశ్వరయాదవ్, సురేష్, పద్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్‌గౌస్, నాయకులు, కార్యకర్తలు తాయన్న, సురేష్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, కృపాకర్, శంకర్, నాగరాజ్, చిన్నఈరన్న, వీరప్ప, వి.కె.జైపాల్, వి.కె.వెంకటేశులు, వీరభద్రప్ప పాల్గొన్నారు.


మిర్చి మార్కెట్ ఏర్పాటుకు చర్యలు



చర్చిస్తున్న యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, చైర్మన్ మజర్‌అహ్మద్

ఆదోనిఅర్బన్ : స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో మిర్చి మార్కెట్ ఏర్పాటుకు శుక్రవారం కమీషన్ ఏజెంట్లు, కోల్డ్ స్టోరేజీ యాజమానులతో యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగ, సింధనూరు, రాయచూరు, గదగ్, హుబ్లీలోని మిరప మార్కెట్‌లను సందర్శించి, వ్యాపారులతో చర్చించి ఇక్కడ ఎలాంటి చర్యలు చేపట్టాలో చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇందుకు కమీషన్ ఏజెంట్లు, అధికారులు త్వరలో కర్ణాటక రాష్ట్రానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని యార్డు సెక్రటరీ సూచించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్‌లో బ్యాడిగ, గుంటూరు మిరపను ఎక్కువశాతం పండిస్తున్నారని చెప్పారు. కర్ణాటక రాష్ట్రంలోని, గుంటూరులోని వ్యాపారులు కూడా ఇక్కడ టెండర్ వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్, సూపర్‌వైజర్‌లు మోహన్‌రెడ్డి జ్ఞానప్ప, కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యుడు వీరభద్రగౌడ్, రాజాగౌడ్, గుడిసె శ్రీరాములు, కోల్డ్ స్టోరేజ్ యజమాని రాచోటి సుబ్బయ్య పాల్గొన్నారు.

పంప్‌హౌస్ యంత్రాలకు మరమ్మతులు



రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసిన దృశ్యం

కోసిగి: మండలంలోని తుంగభద్ర నది ఒడ్డున ఆర్డీఎస్ ఆనకట్ట సమీపంలో ఏర్పాటు చేసిన మూగలదొడ్డి పంప్‌హౌస్‌లోని యంత్రాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో మరమ్మతులు చేపట్టి సాగునీటిని విడుదల చేసినట్లు మూగలదొడ్డి గ్రామ రైతులు సోమేష్, రమేష్, వీరారెడ్డి, రామిరెడ్డి, వెంకటేష్ తెలిపారు. శుక్రవారం పంప్ హౌస్‌కు మరమ్మతులు చేయించి రిజర్వాయర్‌కు సాగునీటిని విడుదల చేశారు. రైతులు మాట్లాడుతూ 20 రోజుల క్రితం పంప్ హౌస్ మిషన్ నిలిచిపోయింది. దీంతో రిజర్వాయర్‌కు నీటి పంపింగ్ ఆగిపోయింది. సమస్యను అధికారులకు విన్నవించడంతో బడ్జెట్ వచ్చేంత వరకు తామేం చేయలేమని చెప్పారు. దీంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సొంతంగా రూ.లక్ష అందించి వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. నీరందకపోతే పంటలు నష్టపోతామని, ప్రస్తుతం పంటలు చేతికందే దశలో ఉన్నాయని, నీటి తడులు అత్యవసరమైన సమయంలో ఎమ్మెల్యే సహకరించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

మిరప పంట ధ్వంసం



తొలగించిన పంటను చూపుతున్న బాధిత రైతు

కోసిగి: మండల కేంద్రం కోసిగి సిద్దప్ప పాళెం ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న గడ్ల చిన్న ఈరన్నకు చెందిన మిరప పంటను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లి చూడగా పంటను పూర్తిగి నాశనం చేశారని వాపోయాడు. మండలంలోని దుద్ది సమీపంలోని ఎండపల్లి గ్రామ పరిధిలోని గడ్ల ఈరన్నకు 3. 80 ఎకరాలు పొలం ఉంది. అందులో మిరప పంట సాగుచేశారు. ప్రస్తుతం పంట కాపుకొచ్చింది. దుండగుల చర్యతో దాదాపు రూ.5లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు విలపించాడు.తమకు న్యాయం చేయాలని కోసిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గొరవయ్యల ఆటలు అద్భుతం



దేవరగట్టులో బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ

హొళగుంద: దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవంలో గొరవయ్యలు ఆటలు అద్భుతం అని బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ అన్నారు. శుక్రవారం గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట తదితర కార్యక్రమాలను ఆమె వీక్షించి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. అలాగే కొండపై వెలసిన మాళ మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిమ కలిగిన దేవరగట్టు స్వామిని దర్శించుకుంటే కష్టాలన్నీ తీరుతాయన్నారు. ఎక్కడెక్కడి నుంచో గొరువయ్యలు దేవరగట్టుకు చేరుకుని నృత్యాలు చేయడం, వారి ఆచారాలను సంస్కృతిని చాటడం వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయన్నారు. కురువ పెద్దలు గర్జప్ప, ఎస్కే గిరి, రవిస్వామి, రమేష్, మహేశ్ తదితరులు వెంట ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన సాయి, వెంకటేష్, నబీ

ఆస్పరి: మండలంలోని నలకదొడ్డి బస్‌స్టాప్ వద్ద శుక్రవారం బొలెరో, ఆటో ఢీకొన్న ప్రమాదంలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పరి నుంచి బిల్లేకల్లు వెళ్తున్న బొలెరో, బిల్లేకల్లు నుంచి ఆస్పరి వైపు వస్తున్న ఆటో నలకదొడ్డి బస్‌స్టాప్ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆస్పరికి చెందిన సాయి, వెంకటేష్, బళ్లారికి చెందిన నబీ, ఈరన్నకు తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పరికి చెందిన సాయి, వెంకటేష్ ఆటోలో చిక్కుకుపోవడంతో స్థానికులు అతికష్టంపై బయటకు తీశారు. గాయపడిన నలుగురిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.